batukammanews.com
TEL/2019/78873

# బతుకమ్మ

తాజా వార్తల సద్దిమూట

17 ఆగస్టు 2026
సోమవారం

## కేటుగాడిని అరెస్ట్ చేసిన సీసీఎస్ పోలీసులు

హైదరాబాద్,, బతుకమ్మ :హైదరాబాద్‌లో భూములు, స్థలాలపై బ్యాంకు రుణాలు ఇప్పిస్తామంటూ నమ్మించి కోట్లాది రూపాయల మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర కేటుగాడిని సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆస్తులపై రుణాలు ఇప్పిస్తామని బాధితులను నమ్మించి.. వారి నుంచి సేల్ డీడ్ పత్రాలు తీసుకుని.. వాటిని దుర్వినియోగం చేసి మూడో వ్యక్తుల పేరిట ఆస్తులు బదలాయించడం.. అనంతరం అదే ఆస్తులను బ్యాంకుల్లో కుదువపెట్టి భారీగా రుణాలు పొందడం చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

02



# మీరు అండగా నిలబడండి..

05



# మీ సమస్యను పరిష్కరిస్తాం...



## ములుగు కలెక్టరేట్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

ములుగు, బతుకమ్మ :ములుగు జిల్లాలో కొత్తగా నిర్మించిన కలెక్టరేట్ భవన సముదాయాన్ని (IDOC) ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ములుగు జిల్లా సమగ్రాభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేస్తామని చెప్పారు. వేయి స్తంభాల గుడితో పోటీ పడే విధంగా వనదేవతలు సమ్మక్క - సారలమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేశారని చెప్పారు. ములుగు ప్రాంతానికి సంబంధించి ప్రత్యేకంగా జంపన్నవాగును నూటికి నూరు శాతం అభివృద్ధి చేస్తామన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేకంగా సమీక్షించి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు.





## అక్బర్ నగర్ గుట్టల్లో

# జోరుగా పత్తాలాట...

### చేతులు మారుతున్న లక్షల రూపాయలు...

### రోడ్డున పడుతున్న కుటుంబాలు...


02

రుద్రూర్, బతుకమ్మ: రుద్రూర్ మండలంలోని అక్బర్ నగర్ గుట్ట ప్రాంతంలో ప్రతి రోజు జోరుగా పత్తాలాట కొనసాగుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. పేకాటరాయుళ్లు, నిర్వాహకులు గ్రామస్తులకు కనబడకుండా గ్రామ శివారులోని గుట్ట ప్రాంతాలను అడ్డాగా చేసుకుంటున్నారు. పేకాటరాయుళ్లను మచ్చిక చేసుకొని కొందరు వ్యక్తులు టీములుగా ఏర్పడి పేకాటను నిర్వహిస్తూ లక్షల రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు.

## వనదేవతలను దర్శించుకున్న

# సీఎం రేవంత్ రెడ్డి

ములుగు, బతుకమ్మ :వన దేవతలు సమ్మక్క - సారలమ్మ సన్నిధిలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వితంతువులు, ఒంటరి మహిళలకు చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ములుగు జిల్లా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి సమ్మక్క - సారలమ్మ గద్దెలను దర్శించుకున్నారు.



02

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ రద్దుకు కాంగ్రెస్ చేస్తున్న కుట్రను అడ్డుకోవాలి

### 17 న రాష్ట్ర వ్యాప్తంగా

### నిరసనలకు బిఆర్ఎస్ పిలుపు



02

హైదరాబాద్, బతుకమ్మ : హైకోర్టు తీర్పు సాకుతో పేదింటి ఆడబిడ్డల భరోసాను ఎత్తివేసేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నుతుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కళ్యాణ లక్ష్మి అంశంలో హైకోర్టులో కౌంటర్ వేయకుండా కాంగ్రెస్ కుట్ర చేసిందని అన్నారు ముఖ్యమంత్రి, మంత్రుల అవినీతి అంశాల్లో ఓట్ల రూపాయలు చెల్లించి ప్రైవేటు లాయర్లను పెట్టుకునే ప్రభుత్వం ఈ అంశంలో ఎందుకు కౌంటర్ వెయ్యలేదు అని ప్రశ్నిశీచారు.



# వనదేవతలను దర్శించుకున్న సీఎం రేవంత్ రెడ్డి

ప్రత్యేక పూజా కార్యక్రమం మొక్కులో భాగంగా సమ్మక్క సారలమ్మలకు నిలువెత్తు బంగారం సమర్పించారు. ఆలయం ప్రాంగణంలో మొక్కను నాటారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా గిరిజన పూజారులు డోలు వాయిద్యాలు, గిరిజన సంప్రదాయాల నడుమ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్థానికంగా అర్హులైన వితంతు, ఒంటరి మహిళలకు పింఛన్లను పంపిణీ చేసి రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేసే కార్యక్రమానికి లాంఛనంగా శ్రీకారం చుట్టారు. మేడారానికి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తాగునీటి ప్లాంట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. భక్తులకు పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను సూచించారు. ఆలయ ప్రాంగణంలో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. మహిళా సంఘాలు చేపడుతున్న కార్యక్రమాలు, వారి ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దనసరి అనసూయ సీతక్క , పొంగులేటి శ్రీనివాస రెడ్డి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , విప్ రామచంద్ర నాయక్ , ఎంపీలు వేం నరేందర్ రెడ్డి , పోరిక బలరాం నాయక్ , కడియం కావ్య , ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి , గండ్ర సత్యనారాయణ రావు , నాయని రాజేందర్ రెడ్డి , కోరం కనకయ్య , పాయం వెంకటేశ్వర్లు , తెల్లం వెంకట్రావు , జారే ఆదినారాయణ , మురళి నాయక్ , ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ రద్దుకు కాంగ్రెస్ చేస్తున్న కుట్రను అడ్డుకోవాలి

తెలంగాణ ఆడబిడ్డలు, వారి కుటుంబాల తరఫున బీఆర్ఎస్ కాంగ్రెస్ నిలదీస్తుందని, ఆడబిడ్డల తులం బంగారం అడుగుతున్నందుకే పూర్తిగా కళ్యాణ లక్ష్మిని ఎత్తగొట్టే కుట్రసోమవారం రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ, మండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలని కల్వకుంట్ల తారక రామారావు పిలుపు నిచ్చారు. ఆదివారం పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర జనరల్ బాడీ సభ్యులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఈ నెల 17 న నిరసనలకు పిలుపునిచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ఆర్థిక భరోసాకు ప్రతీకగా నిలిచిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పూర్తిగా రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ లక్షలాది పేద కుటుంబాలకు అండగా నిలిచిన ఈ పథకాలను ఎత్తివేసేందుకు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ కుట్రను అడ్డుకోవడంతో పాటు కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు రేపు రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర జనరల్ బాడీ సభ్యులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కేటీఆర్ ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కేవలం ఒక సంక్షేమ పథకం మాత్రమే కాదని, తెలంగాణ పేద కుటుంబాల ఆడబిడ్డల భవిష్యత్తు, ఆత్మగౌరవంతో ముడిపడిన కార్యక్రమాలని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన వెంటనే పేద కుటుంబాల్లో ఆడబిడ్డ పెళ్లి ఎంతటి ఆర్థిక భారమో గుర్తించిన కేసీఆర్ 2014 అక్టోబర్ 2న ఈ పథకాలను ప్రారంభించారని గుర్తుచేశారు. రూ. 51 వేల ఆర్థిక సహాయంతో ప్రారంభమైన ఈ పథకాన్ని దశలవారీగా రూ. 75,116కు, అనంతరం రూ. 1,00,116కు పెంచారని తెలిపారు. కేసీఆర్ హయాంలో సుమారు 13 లక్షల మంది ఆడబిడ్డల కుటుంబాలకు రూ. 13 వేల కోట్ల మేర ఆర్థిక సహాయం అందిందన్నారు.

కోవిడ్ వంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభ సమయంలోనూ కేసీఆర్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి ద్వారా పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలిచిందని గుర్తుచేశారు. అయితే ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మితో పాటు ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని బలోపేతం చేయాల్సింది పోయి దానినే రద్దు చేసేందుకు ప్రయత్నిస్తోందని కేటీఆర్ విమర్శించారు. కళ్యాణ లక్ష్మి కోసం ఎదురుచూస్తున్న ప్రతి ఆడబిడ్డ ఇప్పుడు ఎన్నికల హామీ ప్రకారం తులం బంగారం కూడా డిమాండ్ చేస్తుండటంతో, ఆ ప్రశ్నల నుంచి తప్పించుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి ఎంత దారుణంగా మారిందో అర్హులైన లబ్ధిదారులే చెబుతున్నారని అన్నారు. పెళ్లిళ్లు జరిగి చాలా కాలం గడిచినా, కొందరికి పిల్లలు పుట్టినా కూడా తమకు రావాల్సిన కళ్యాణ లక్ష్మి సహాయం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారని ధ్వజమెత్తారు. చాలా కాలం తర్వాత ఆమోదం పొందిన దరఖాస్తులకు సంబంధించిన చెక్కులు కూడా పూర్తిస్థాయిలో పంపిణీ కాకుండా ఆగిపోయాయని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని అర్హులైన దరఖాస్తులను వెంటనే పరిష్కరించి, ఆర్థిక సహాయాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కళ్యాణ లక్ష్మి అంశం హైకోర్టు పరిధిలో ఉన్న సమయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై కూడా కేటీఆర్ మండిపడ్డారు. నాలుగుసార్లు గడువు ఇచ్చినా ప్రభుత్వం కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించారు. పేదింటి ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన కీలకమైన అంశంలో ప్రభుత్వం సరైన వాదనలు ఎందుకు వినిపించలేకపోయిందని నిలదీశారు. ముఖ్యమంత్రి, మంత్రులు అవినీతి వంటి హైడ్రా వంటి అంశాల్లో ప్రైవేటు న్యాయవాదులకు భారీ మొత్తాలు చెల్లించి వాదించే ప్రభుత్వం, ఆడబిడ్డల హక్కులకు సంబంధించిన పథకాన్ని కాపాడుకునే విషయంలో మాత్రం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ప్రశ్నించారు.

# 2145 గ్రామీణ రహదారులకు శంకుస్థాపన

## హ్యామ్ రోడ్ పైలన్ ఆవిష్కరణ చేసిన సీఎం రేవంత్ రెడ్డి

ములుగు, బతుకమ్మ :గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి ప్రణాళికకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,145 గ్రామీణ రహదారుల అభివృద్ధికి శుభారంభం పలికారు. గ్రామీణ రహదారుల అభివృద్ధికి సంబంధించి ములుగులో ఏర్పాటు చేసిన పైలాన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ములుగు జిల్లా గట్టమ్మ ఆలయం ఎదురుగా నిర్మించిన హ్యామ్ రోడ్ల పైలాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు.గ్రామ పంచాయతీల నుంచి మండల కేంద్రాలు, రాష్ట్రంలోని ప్రధాన రహదారులకు రోడ్లను అభివృద్ధి చేసి అనుసంధానం చేసే ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ రవాణా రంగంలో సరికొత్త అధ్యాయానికి ములుగు కేంద్రంగా తొలి అడుగు పడింది. ఈ కార్యక్రమంలో మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.






# జుక్కల్ ఎమ్మెల్యే కూతురు వివాహ రిసెప్షన్ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

జుక్కల్, బతుకమ్మ :ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కామారెడ్డి జిల్లా బిచ్కుందలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు కుమార్తె వివాహ రిసెప్షన్‌కు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జుక్కల్ ఎమ్మెల్యే తోట్ల లక్ష్మీకాంతరావు రోజుముఖ్య మంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు కామారెడ్డి జిల్లా జుక్కల్ ఎమ్మెల్యే శ్రీ తోట లక్ష్మీకాంతరావు గారి కుమార్తె జోనిట మరియు దాస్ల యొక్క వివాహ విందుకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. ఈ వేడుకల్లో తెలంగాణ పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.





# అక్బర్ నగర్ గుట్టల్లో జోరుగా పత్తాలాట...

– మందు, విందు ఆట వద్దే..

పేకాట అంటేనే క్రేజీ గేమ్ గా మారింది. ఉదయం నుంచి రాత్రి సుమారు 9 :00 గంటల వరకు పేకాట కొనసాగుతున్నది. ఉదయం వేళల్లో పేకాట నిర్వాహకులు రెక్కీ నిర్వహించి ఏ ప్రాంతం అయితే ఆటకు ఇబ్బంది ఉండదో, ఏ ప్రాంతంలో ఆట పెడితే పేకాటరాయుళ్లు వస్తారో అక్కడ అడ్డాలు ఏర్పాటు చేస్తున్నారు. పేకాడే స్థలానికి కొద్ది దూరంలో నిర్వాహకులు ఇద్దరు నుంచి నలుగురు వ్యక్తులతో నిఘా ఉంచుతారు. పేకాటరాయుళ్లను మచ్చిక చేసుకునేలా మందు, విందు ఏర్పాట్లు చేస్తూ డబ్బులను దండుకుంటున్నారు. పేకాడుతుండగా డబ్బులు పోయిన వారికి ఫైనాన్షియర్లు అప్పులు ఇస్తున్నారని, రూ. 10 వేలు ఇస్తే తర్వాత రూ. 11 వేలు ఇవ్వాల్సి ఉంటుందని ఒప్పందం చేసుకుంటున్నారని తెలుస్తున్నది. పేకాట నిర్వహించే వ్యక్తులు ప్రతి రోజూ కేట్ తీయడంతో పాటు మందు, తిండి ఖర్చులు పోనూ సుమారు రూ. 20 వేల వరకు దండుకుంటున్నారని సమాచారం. పేకాటలో డబ్బులు పోగొట్టుకుని పలు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. పేకాట ఆడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నదని, పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి పేకాటకు అడ్డుకట్ట వేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# కేటుగాడిని అరెస్ట్ చేసిన సీసీ ఎస్ పోలీసులు

రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌కు చెందిన నునావత్ యుగంధర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. 2016 నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో యుగంధర్‌పై 20కి పైగా క్రిమినల్, సివిల్ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. తాజాగా ఓ బాధితుడికి రూ. 60 లక్షల ఆర్థిక సాయం చేసిన యుగంధర్.. ఆస్తిని వేరొకరికి విక్రయించనంటూ మీఖ చేసుకున్నాడు. అనంతరం సేల్ డీడ్‌ను దుర్వినియోగం చేసి.. బాధితుడికి తెలియకుండానే ఆస్తిని మూడో వ్యక్తి పేరిట మార్చేశాడు ఆ తర్వాత అదే ఆస్తిని కుదువపెట్టి యాక్సిస్ బ్యాంక్ నుంచి సుమారు రూ. 1.50 కోట్ల రుణం తీసుకున్నాడు. రుణం చెల్లించకుండా డిఫాల్ట్ కావడంతో బ్యాంకు అధికారులు బాధితుడికి నోటీసులు పంపారు. దీంతో అసలు మోసం బయటపడింది.

బాధితుడి ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన సీసీఎస్ పోలీసులు.. యుగంధర్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడి మోసాల చిట్టా బయటపడింది. ఆస్తులపై రుణాలు ఇప్పిస్తామంటూ 30 మందికి పైగా అమాయకులను నమ్మించి.. రూ. 10 కోట్లకు పైగా మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటికే యుగంధర్‌పై 12 క్రిమినల్ కేసులు, 8 సివిల్, NI యాక్ట్ కేసులు నమోదై ఉన్నాయి.

మరో నాలుగు కేసుల్లో అతడు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. భూములపై రుణాలు ఇప్పిస్తామంటూ వచ్చే నకిలీ ఫైనాన్స్ కన్సల్టెన్సీలు, మధ్యవర్తుల మాటలు నమ్మి ఆస్తి పత్రాలను అప్పగించవద్దని సీసీఎస్ పోలీసులు ప్రజలను హెచ్చరించారు. పత్రాలు ఇచ్చే ముందు పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలని సూచించారు.

# బాల్కొండ నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుండి

# బీఆర్ఎస్ పార్టీలోకి భారీ చేరికలు

**కాంగ్రెస్ మోసపూరిత పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత**

**కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలే మళ్లీ బీఆర్ఎస్‌ను అధికారంలోకి తెస్తాయి**

**మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**





వేల్పూర్, బతుకమ్మ :ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి సర్కార్‌పై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి మొదలైందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు.రాష్ట్రంలో ప్రజా సంక్షేమం తిరిగి గాడిన పడాలంటే కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని ఆయన స్పష్టం చేశారు.కమ్మర్పల్లి మండల కొనపూర్, కె సి తండా కు చెందిన సీనియర్ నాయకులు లకావత్ కన్నయ్య, చిలివేరి సత్యనారాయణ, తండా పెద్దమనిషి దేవులునాయక్,గుగ్గ వత్ శ్రీనివాస్ నాయకత్వంలో బీజేపీ,కాంగ్రెస్ పార్టీలకు చెందిన సుమారు 100 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీఆర్ ఎస్ నాయకులు రాజాగౌడ్, గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ నాయకుల సమక్షంలో వేల్పూర్ లో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ...**

ఎన్నికల వేళ మహిళలకు నెలకు ?2,500 ఇస్తామని, పింఛన్లను ?2,000 నుంచి ?4,000కు పెంచుతామని, ?500కే గ్యాస్ సిలిండర్ మరియు కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఒక్క హామీని కూడా సంపూర్ణంగా నెరవేర్చలేకపోయింది.వ్యవసాయంపై ఆధారపడిన గిరిజనులు, సాధారణ రైతులకు రేవంత్ సర్కార్ తీరని అన్యాయం చేస్తోంది. ?2 లక్షల రుణమాఫీ సగం మంది రైతులకు కూడా అందలేదు. కేసీఆర్ హయాంలో నిరంతరాయంగా అందిన రైతుబంధును ?15,000కు పెంచుతామని చెప్పి, ఉన్న ?10,000ను కూడా సక్రమంగా ఇవ్వకుండా ఎగ్గొట్టి రైతులను ఆగం చేసారు.గతంలో ఫోన్ చేయగానే పొలాల వద్దకే ఎరువులు చేరే పరిస్థితి ఉండేది. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో యాప్‌ల పేరుతో రైతులను గందరగోళానికి గురిచేస్తున్నారు. యూరియా, ఎరువుల కోసం అన్నదాతలు రోడ్లపై నిలబడాల్సిన దుస్థితి నెలకొంది.వడ్ల కొనుగోలు కేంద్రాల్లో సరైన నిర్వహణ లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్వింటాలుకు 10 కిలోల వరకు తరుగు తీస్తూ రైతుల శ్రమను దోచుకుంటున్నారు.గతంలో లగచర్ల లో లంబాడాల భూములను కాపాడేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పోరాడి వారి హక్కులను కాపాడిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలు ప్రతిరోజూ గుర్తు చేసుకుంటున్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, రాబోయే రోజుల్లోరేవంత్ రెడ్డి పోయి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఆగిపోయిన అభివృద్ధి పనులన్నింటినీ రాబోయే రోజుల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.తండా ప్రజల కష్టసుఖాల్లో తాను ఎల్లప్పుడూ ఒక అన్నగా, తమ్ముడిగా అండగా ఉంటానని, గిరిజన సోదరీమణులు కోరిన విధంగా త్వరలో జరిగే తీజ్ పండుగ వేడుకలకు తప్పకుండా హాజరవుతానని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోనాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉతకం నర్సయ్య, బడాలా రమేష్,రాజు చైర్మన్, బడాలా రాజారెడ్డి, పుర్కుటపు చిన్నారెడ్డి, పురుషోత్తం, జాల రాజు, పాలేపు గంగారెడ్డి, బోట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా అనంత లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం...




–బోధన్, బతుకమ్మ :బోధన్ పట్టణంలోని బురుడుగల్లీలో గల శ్రీశ్రీశ్రీ అనంత లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు,హోమం,యాగం, గోపూజ తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.మధ్యాహ్నం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారికి పల్లకి సేవ నిర్వహించారు .ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.
కార్యక్రమంలో గమరపేట శంకర్,చక్రి,లింగం,వెంకట్, ప్రవీణ్,ప్రసాద్, భాస్కర్, అక్షయ్,ప్రశాంత్,వినోద్, విగ్నేష్,నితిన్,యశ్వంత్, ప్రణయ్,శివకుమార్,కార్తీక్, సిద్దు,శివ చరణ్,అజయ్ నందు,కిట్టు,వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## జుక్కల్ ఎమ్మెల్యే కూతురు రిసెప్షన్ వేడుకలకు అతిరథులు



కామారెడ్డి, బతుకమ్మ : బిచ్కుంద పట్టణంలో జుక్కల్ నియోజకవర్గ శాసన సభ్యులు లక్ష్మి కాంత రావు కుమార్తె జోనిట వివాహ ముందస్తు వేడుకకు హాజరై కాబోయే వధూవరులు జోనిట – దాస్ లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి. ఆదివారం జరిగిన ఈ వివాహ విందులో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి , ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, మహమ్మద్ షబ్బీర్ అలీ లు , జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్ , ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసన సభ్యులు మదన్ మోహన్ రావు , నారాయణఖేడ్ శాసన సభ్యులు సంజీవ రెడ్డి , మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు



## చిక్కిన 36 కిలోల చేపలు- మత్స్యకారునికి బొచ్చెడంత ఆనందం





గంగాధర, బతుకమ్మ :కరీంనగర్ జిల్లా గంగాధర మండలం దర్శకుర్తి గ్రామంలో సంపత్ అనే మత్స్యకారునికి భారీ చేపలు దొరికాయి. ఒకరోజు 20 కిలోల చేప, మరోరోజు 36 కిలోలు చేప చిక్కాయి.మత్స్య కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు

## సీఎం మర్యాదపూర్వకంగా కలిసిన వరంగల్ పోలీస్ కమిషనర్

పరకాల, బతుకమ్మ :పరకాల పర్యటనలో భాగంగా ఆదివారం సాయంత్రం పరకాల జూనియర్ కళాశాల మైదానానికి హెలికాప్టర్‌లో చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి స్వాగతం పలికారు.



## మహిళ ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

### నగదు-బంగారం కుటుంబానికి అప్పగింత





భిక్కనూరు, బతుకమ్మ :అనారోగ్యంతో మనస్తాపం చెందిన 60 ఏళ్ల గృహిణి ఆత్మహత్య యత్నం చేయగా 108 సిబ్బంది సకాలంలో రక్షించి, ఆమె వద్ద ఉన్న నగదు, 2 తులాల బంగారాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.వివరాల్లోకి వెళితే కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంజంగంపల్లి గ్రామానికి చెందిన పేరం పుష్ప(60) సంవత్సరాలు అనారోగ్య కారణంతో చెరువులో ఆత్మహత్యాయత్నం చేయబోయారు. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే 108 కు సమాచారం అందించారు.సమాచారం అందిన వెంటనే బిక్కనూర్ 108 అంబులెన్స్ లోని ఈఎంటీ రాజేందర్, పైలట్ రాజయ్య సంఘటన స్థలానికి చేరుకొని ఆమెనురక్షించారు.అంతే కాకుండా ఆమె వద్ద ఉన్న నగదు, 2 తులాల బంగారాన్ని జాగ్రత్తగా స్వాధీనం చేసుకొని కుటుంబ సభ్యులకు అప్పగించారు.ప్రాణాలు కాపాడడమే కాకుండా ఆస్తులను కూడా సురక్షితంగా తిరిగి ఇచ్చిన 108 సిబ్బందిపై కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## అంతర్జాతీయ స్కేటింగ్ పోటీల్లో హన్మాజీపేట్ యువకుల సత్తా



బాన్సువాడ బతుకమ్మ : అంతర్జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో హన్మాజీపేట్ గ్రామానికి చెందిన యువకులు ప్రతిభ చాటుకున్నారు. అంతర్జాతీయ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 80 నిమిషాల నాన్‌స్టాప్ రోలర్ స్కేటింగ్ పోటీలో కమ్మరి ఆనంద్, పర్శా వినయ్, వడ్ల శ్రావణ్ పాల్గొన్నారు.పోటీలో 80 నిమిషాల పాటు నిర్విరామంగా స్కేటింగ్ చేస్తూ అద్భుత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించారు. ఈ విజయంతో హన్మాజీపేట్ గ్రామానికి వారు గర్వకారణంగా నిలిచారు.యువకులు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటడం పట్ల గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. విజేతలను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# క్రీడారంగం నుంచి తుమ్మల విద్యాసాగర్ రెడ్డికి విరమణ లేదు..

### గ్రామీణ ప్రాంతాల నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దడంలో పీఈటీల పాత్ర అభినందనీయం






నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :క్రీడారంగానికి తన సుదీర్ఘ ఉద్యోగ జీవితాన్ని అంకితం చేసి, వేలాది మంది విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దడంలో విశేష కృషి చేసిన జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు, ఫిజికల్ డైరెక్టర్ తుమ్మల విద్యాసాగర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కొనియాడారు.తుమ్మల విద్యాసాగర్ రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా నిజామాబాద్ శ్రావ్య గార్డెన్ లో నిర్వహించిన ఘన సన్మాన సభకు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఉద్యోగ విరమణ అనేది కేవలం సర్వీసుకు మాత్రమేనని, క్రీడారంగం నుంచి విద్యాసాగర్ రెడ్డికి ఎప్పటికీ విరమణ ఉండదని ఎమ్మెల్యే అన్నారు. తన సర్వీస్ కాలమంతా క్రీడల అభివృద్ధి, విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీయడం, క్రీడాకారులకు సరైన మార్గదర్శకత్వం అందించడానికే ఆయన అంకితమయ్యారని ప్రశంసించారు.ఎంతకాలం ఉద్యోగం చేశామన్నది మాత్రమే కాకుండా, పనిచేసిన కాలంలో వ్యవస్థకు, సమాజానికి ఎలాంటి మంచి గుర్తింపును అందించామన్నదే అసలైన విజయమని అన్నారు. విద్యాసాగర్ రెడ్డి ఉద్యోగ విరమణ సభకు ఇంతమంది అభిమానులు, సహచరులు, క్రీడాకారులు, ఉపాధ్యాయులు హాజరై ఆత్మీయంగా సన్మానించడం ఆయన నిస్వార్థ సేవలకు నిదర్శనమన్నారు. విద్యాసాగర్ రెడ్డి సాధారణ ఉద్యోగ సమయాలకే పరిమితం కాకుండా, క్రీడా పోటీలు, శిక్షణ కార్యక్రమాలు, క్రీడాకారుల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేశారని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఈ క్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, ముఖ్యంగా ఆయన సతీమణి అందించిన సహకారం ఎంతో గొప్పదని పేర్కొన్నారు. బాల్కొండ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో క్రీడారంగ అభివృద్ధికి పీఈటీలు, పీడీలు చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వ పరంగా పరిమితమైన ప్రోత్సాహకాలు ఉన్నప్పటికీ, అనేక సందర్భాల్లో సొంత వనరులతో క్రీడా పోటీలను నిర్వహిస్తూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీస్తున్నారని కొనియాడారు.క్రీడా పోటీల నిర్వహణలో పీఈటీలు ప్రదర్శిస్తున్న క్రమశిక్షణ, సమన్వయం, ఐక్యత ఆదర్శప్రాయమన్నారు.కొత్తపల్లి, జక్రాన్‌పల్లి, డొంకేశ్వర్, గంగాధర్ పల్లి, ముప్కాల్ తదితర గ్రామీణ ప్రాంతాలు క్రీడలకు కేంద్రాలుగా ఎదగడంలో వ్యాయామ ఉపాధ్యాయుల కృషి కీలకమని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారికి సరైన శిక్షణ, ప్రోత్సాహం అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత మంది క్రీడాకారులు వెలుగులోకి వస్తారని తెలిపారు.రాష్ట్రస్థాయి కబడ్డీతో పాటు ఇతర క్రీడా టోర్నమెంట్ల నిర్వహణకు పీఈటీ అసోసియేషన్ ఏ ప్రణాళికతో ముందుకు వచ్చినా తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హామీ ఇచ్చారు. బాల్కొండ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లాలో క్రీడారంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు.విద్యాసాగర్ రెడ్డి ఉద్యోగ విరమణ అనంతరం కూడా క్రీడారంగంతో తన అనుబంధాన్ని కొనసాగించాలని, తన సుదీర్ఘ అనుభవాన్ని భావితరాల క్రీడాకారులకు మార్గదర్శకంగా అందించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. భవిష్యత్తులో ప్రాంతంలో క్రీడారంగ అభివృద్ధికి ఆయన అనుభవం, సేవలను గౌరవప్రదంగా వినియోగించుకుంటామని తెలిపారు.విద్యాసాగర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా జరిగిన ఈ ఆత్మీయ సన్మానం ఆయనకు మరపురాని జ్ఞాపకంగా నిలవాలని, ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలు, ఆనందోత్సాహాలతో సాగాలని వేముల ప్రశాంత్ రెడ్డి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డీఎస్పీ తుమ్మల మనోహర్ రెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు మోహన్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు గంగారాం, పీఈటీ నాయకులు రాజ్ కుమార్, మల్లేశ్వర్, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా స్థాయి వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, విద్యాసాగర్ రెడ్డి కుటుంబ సభ్యులు, మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ దృక్పథంతో యువత ముందుకు సాగాలి

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :జీవపరిణామ సిద్ధాంతం, నిర్మాణం పనివిధానంపై ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా శిక్షణ తరగతులు శ్రీ నగర్ కాలనీలో నిర్వహించడం జరిగింది. యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి. నవీన్ కుమార్ అధ్యక్షతగా, జీవపరిణామ సిద్ధాంతం జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు నర్ర రామారావు వివరిస్తూ, నిర్మాణం పనివిధానం పివై ఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దింటి రామకృష్ణ వివరించారు. యువతలో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడంతో పాటు, సమాజంలోని సమస్యలను శాస్త్రీయంగా విశ్లేషించి ప్రజల పక్షాన నిలబడి పోరాడే విధంగా కార్యకర్తలను తీర్చిదిద్దడమే శిక్షణ తరగతుల ప్రధాన ఉద్దేశ్యమన్నారు.ఈ సందర్భంగా "జీవపరిణామ సిద్ధాంతం" అనే అంశంపై జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు నర్ర రామారావు వివరిస్తూ జీవం ఆవిర్భావం, జీవుల్లో కాలానుగుణంగా చోటుచేసుకున్న మార్పులు, ప్రకృతి మరియు జీవుల మధ్య సంబంధం, జీవుల పరిణామ క్రమం, డార్విన్ ప్రతిపాదించిన సహజ ఎంపిక సిద్ధాంతం తదితర అంశాలను శాస్త్రీయ దృక్పథంతో వివరించారు. ప్రకృతి పరిణామాలను అర్థం చేసుకోవడం ద్వారా మూఢనమ్మకాలు, అశాస్త్రీయ భావనలకు వ్యతిరేకంగా ప్రజల్లో శాస్త్రీయ చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

పి వై ఎల్ నిర్మాణం -- పనివిధానంపై పివై ఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దింటి రామకృష్ణలి వివరిస్తూ,

ప్రగతిశీల యువజన సంఘం (పి వై ఎల్ ) నిర్మాణం, పనివిధానంపై కార్యకర్తలకు శిక్షణ నిర్వహించారు. సంఘ ఆవిర్భావం, లక్ష్యాలు, సంఘ నిర్మాణం, సభ్యత్వం, కమిటీల ఏర్పాటు, నాయకత్వ బాధ్యతలు, సమావేశాల నిర్వహణ, ప్రజా సమస్యలపై అధ్యయనం చేయడం, సమస్యలను గుర్తించి యువతను సమీకరించడం వంటి అంశాలను వివరించారు.

సంఘం బలమైన నిర్మాణం కోసం అధ్యయనం--చర్చ--ప్రజలతో సంబంధం--కార్యాచరణ అనే విధానంతో ముందుకు సాగాలని సూచించారు. యువత ఎదుర్కొంటున్న విద్య, ఉపాధి, నిరుద్యోగం, సామాజిక అసమానతలు వంటి సమస్యలను అధ్యయనం చేసి, వాటి పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.

యువతలో శాస్త్రీయ ఆలోచన పెంపొందించాలి







నేటి సమాజంలో శాస్త్రీయ ఆలోచనా విధానం అత్యంత అవసరమని, యువత మూఢనమ్మకాలకు దూరంగా ఉండి ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని నాయకులు అన్నారు. సమాజంలోని అన్యాయాలు, అసమానతలు, ప్రజా సమస్యలపై అధ్యయనం చేసి ప్రజలతో మమేకమై పనిచేసే యువతను తయారు చేయడమే పి వై ఎల్ లక్ష్యమని తెలిపారు.

ఈ తరగతుల ద్వారా కార్యకర్తలకు సైద్ధాంతిక అవగాహనతో పాటు సంఘ నిర్మాణం, ప్రజా సమస్యలపై పనిచేసే పద్ధతులపై స్పష్టత కలిగిందని నిర్వాహకులు తెలిపారు.

రాబోయే రోజుల్లో జిల్లాలోని మండలాలు, పట్టణాలు, గ్రామాల్లో మరిన్ని శిక్షణ తరగతులు నిర్వహించి యువతను పెద్ద సంఖ్యలో సంఘటితం చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పి వై ఎల్ జిల్లా ఉపాధ్యక్షులు సాయిబాబా,జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, జిల్లా నాయకులు రమేష్ చారి, అశోక్,సాయి,పృథ్వీ,నవీన్, సృజన్, లోకేష్,హర్ష వర్ధన్,రవి తదితరులు పాల్గొన్నారు.



# పోక్సో కేసుల్లో చిన్నారుల భద్రత,గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

## జిల్లాలో పోక్సో కేసుల దర్యాప్తుపై సమీక్ష సమావేశంలో సీపీ సాయిచైతన్య

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : పోక్సో కేసుల్లో చిన్నారుల భద్రత,గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని,బాధితుల పట్ల సున్నితమైన వైఖరితో వ్యవహరించాలని పోలీసు కమిషనర్ సాయిచైతన్య సూచించారు. నిజామాబాద్ జిల్లాలో చిన్నారులపై లైంగిక నేరాలకు సంబంధించిన పోక్సో కేసుల దర్యాప్తు, కేసుల పురోగతిపై పోలీస్ కమీషనర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సీపీ సాయి చైతన్య ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన చిన్నారులపై లైంగిక దాడులు, లైంగిక వేధింపులకు సంబంధించిన కేసులను ఒక్కొక్కటిగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేసుల్లో ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు, నిందితుల గుర్తింపు, అరెస్టులు, సేకరించిన ఆధారాలు, సాక్షుల వివరాలు,బాధిత చిన్నారుల వాంగ్మూలాలు, కేసుల ప్రస్తుత స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసులో దర్యాప్తు ఏ దశలో ఉందనే విషయాన్ని క్షుణ్ణంగా సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న అంశాలను గుర్తించారు.నిందితులను వీలైనంత త్వరగా గుర్తించి అరెస్టు చేయడం, బాధిత చిన్నారులకు త్వరితగతిన న్యాయం జరిగేలా దర్యాప్తును వేగవంతం చేయడంపై పోలీస్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. కేసుల దర్యాప్తులో శాస్త్రీయ ఆధారాల సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని,అవసరమైన ఎఫ్ఎస్ఎల్ పరీక్షలను త్వరితగతిన పూర్తి చేయించి నివేదికలు పొందాలని ఆదేశించారు. అదేవిధంగా బాధితులు,నిందితులకు సంబంధించిన మెడికల్ ఎగ్జామినేషన్ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. కేసుల్లో లభించిన సీసీటీవీ ఫుటేజీ, మొబైల్ ఫోన్లు, డిజిటల్ ఆధారాలు, ఇతర సాంకేతిక ఆధారాలను నిబంధనల ప్రకారం సేకరించి వాటిని దర్యాప్తులో సమర్థవంతంగా వినియోగించాలని అధికారులకు సూచించారు. సాక్షుల వాంగ్మూలాలు, ఇతర కీలక ఆధారాలను పకడ్బందీగా నమోదు చేసి కేసులు కోర్టులో బలంగా నిలిచేలా దర్యాప్తు చేపట్టాలని తెలిపారు. అలాగే ఎఫ్ఎస్ఎల్ నివేదికలు, మెడికల్ రిపోర్టులు, ఇతర దర్యాప్తు ప్రక్రియలు పూర్తయిన వెంటనే చార్జ్‌షీట్ దాఖలు చేసేలా చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు. పోక్సో కేసుల్లో చార్జ్‌షీట్ ఫైలింగ్‌లో ఎలాంటి అనవసర జాప్యం ఉండకూడదని, సాధ్యమైనంత తక్కువ సమయంలో దర్యాప్తును పూర్తి చేసి న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి పోక్సో కేసును సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, దర్యాప్తులో ఏవైనా సాంకేతిక లేదా పరిపాలనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కేసుల పురోగతిపై నిరంతరం





సమీక్ష నిర్వహించి, బాధిత చిన్నారులకు సత్వర న్యాయం అందేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. చిన్నారులపై జరిగే లైంగిక నేరాల విషయంలో పోలీస్ శాఖ అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని, నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా వేగవంతమైన, శాస్త్రీయ, నాణ్యమైన దర్యాప్తు చేపట్టడమే లక్ష్యమని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ ఏసీపీలు ప్రకాష్ యాదవ్, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్లు శ్రీధర్ రెడ్డి, మల్లేషం, సి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ ఆర్. అంజయ్య, సిఐలు ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

# అభినవ పోతన వానమామలై వరదాచార్యుల 115వ జయంతి

## ఉపాధ్యాయుడి నుండి శాసనమండలి వరకు..

భీంగల్, బతుకమ్మ :భీంగల్ పట్టణానికి చెందిన కొరవి గోపరాజు సాహిత్య సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ కవి కంకణాల రాజేశ్వర్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని శ్రీరామ్ నగర్ రెండో వీధిలో తెలంగాణ గర్వించదగిన మహాకవి, అభినవ పోతన, కవి చక్రవర్తి, విధ్వత్కవి, అభినవ కాళిదాసు, మధురకవి వానమామలై వరదాచార్యుల జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత వనమామలై వరదాచార్యుల చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కంకణాల రాజేశ్వర్ మాట్లాడుతూ వానమామలై వరదాచార్యులు నాటి వరంగల్ జిల్లా హనుమకొండ మండలం మడికొండ గ్రామంలో ఒక రైతు కుటుంబంలో 1912 ఆగస్టు 16వ తేదీన సీతమ్మ, బక్కయ్య శాస్త్రిలకు జన్మించారు. వరదాచార్యులు కేవలం 7వ తరగతి వరకే చదువుకున్నారు. ఆయన సహజ పాండిత్యాన్ని గుర్తించిన అప్పటి హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ప్రత్యేక ఉత్తర్వులతో నిజామాబాద్ జిల్లా దోమకొండ జనతా కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాల అధికారి (కార్యనిర్వహణాధికారి)గా నియమించారు. తర్వాత చెన్నూరు ఉన్నత పాఠశాలకు బదిలీ అయి 13 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా పనిచేసి 1972లో పదవీ విరమణ పొందారు. నేటి మంచిర్యాల జిల్లా చెన్నూరులో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. చెన్నూరులో వేద పాఠశాల నెలకొల్పారు. వారి ప్రత్యేక ఆసక్తితో తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ, మరాఠీ, ఆంగ్ల భాషల్లో పాండిత్యం గడించారు. ఆంధ్ర సారస్వత పరిషత్ నుండి విశారదా పట్టా పొందారు. హరికథ గానంలో కూడా ప్రవీణులు. వరదాచార్యులకు కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేసింది. దైవభక్తి, దేశభక్తి రంగరించిన కవిత్వంతో ఆయన చిర కీర్తి పొందారు. 1972లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావు వరదాచార్యులను శాసనమండలికి





నామినేట్ చేశారు. 1978 వరకు శాసనమండలి సభ్యుడిగా విశిష్ట సేవలు అందించారు. 64కు పైగా గ్రంథాలు రచించారు. దేశభక్తి గళాన్ని తన కలం ద్వారా వినిపించారు. పాకిస్తాన్, చైనా యుద్ధాలప్పుడు సమయ సందర్భ సమర కవితలెన్నో రాశారు. కాశ్మీర్ ను లాక్కోవాలని పాక్ కుతంత్రాలు పన్నినప్పుడు చలించిపోయి ఆవేశంతో "ఖబడ్దార్ పాక్! కాశ్మీరం మాదేనోయ్!"అని నినదించారు. 1950లో వానమామలై క్షయ వ్యాధికి గురై ఊపిరితిత్తులకు పలుసార్లు శస్త్ర చికిత్సలు చేయించుకున్నారు. అయినా ఒక ఊపిరితిత్తి తీసివేయాల్సి వచ్చింది. సుదీర్ఘకాలం ఒకే ఊపిరితిత్తి తోనే ఉండి 1984 అక్టోబర్ 31న పరమపదించారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్వసమాజ్ ఉపాధ్యక్షుడు తీగల రఘు, డప్పు ప్రశాంత్, కత్రాజ్ శ్యామ్ రాజ్, నిచ్చెమోల్ల మహేష్, కొండ సాయికిరణ్, గజ్జెల భరత్, రాంగిరి ఆనంద్, సున్నపు సాయికుమార్, కొండ సాయికిరణ్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మీరు అండగా నిలబడండి... మీ సమస్యలు పరిష్కరిస్తాం

జిల్లా కేంద్రంలో ఎస్పీ కార్యాలయంతో పాటు కోర్టు భవనాలను నిర్మించాలని మంత్రి సీతక్క చేసిన సూచనల మేరకు వాటిని త్వరలోనే చేపడుతామని తెలిపారు. మల్లూరు నరసింహ స్వామి దేవాలయానికి కూడా నిధులు మంజూరు చేస్తామని చెప్పారు.ఈ ప్రాంతంలోని ఆదివాసీ బిడ్డలు కష్టానికి మారుపేరు. మీ కష్టాలు తీరాలంటే, సాగునీరు అందించాలి. సాగునీటికి సంబంధించిన ప్రాజెక్టులను మంత్రి పొంగులేటి త్వరలోనే సమీక్ష చేసి, అవసరమైన నిధులు మంజూరు చేస్తారని తెలిపారు.ఈ ప్రాంతంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్, ఏటీసీలతో పాటు భవిష్యత్తులో సాంకేతిక విద్యను అందించడానికి ఈ ప్రాంత నిరుద్యోగుల కోసం ఏం కావాలన్నా నిధులను మంజూరు చేస్తామన్నారు. రైతులు, ఆడపడుచులు, నిరుద్యోగ యువకులు, విద్యార్థుల విషయంలో ప్రభుత్వం పక్కా ప్రణాళికలతో ముందుకు పోతుందని వివరించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు తమ ఫోకస్‌ను మార్చుకోవాలని సూచించారు. నర్సరీ నుండి 12వ వరకు విద్యకు ప్రాధాన్యతనిచ్చి, ఆ తర్వాత స్కిల్స్ నేర్చుకోవాలని ఈ సందర్భంగా యువతకు సూచించారు. విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యం ఉన్నప్పుడే ప్రపంచంతో పోటీపడి రాణించగలరని, విద్య, సాంకేతిక నైపుణ్యం ఉంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు."మీరు అండగా నిలబడండి. మీ సమస్యలన్నింటిని పరిష్కరిస్తాం. రాష్ట్రంలో పాడి పంటలు పండించుకుందాం. తెలంగాణ రాష్ట్రాన్ని సుభిక్షంగా తీర్చిదిద్దుకుందాం" అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# శ్రీ రాజరాజేశ్వర దేవాలయ(మఠం)అభివృద్ధి నూతన కమిటి ప్రమాణ స్వీకారం



బతుకమ్మ కామారెడ్డి: కామారెడ్డి పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వరదే వాలయం(మఠం ) నూతన కమిటి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగానిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా సంగి మోహన్, ప్రధాన కార్యదర్శి సంగి వేణు గోపాల్,కోశాధికారి శివ,గౌరవ అధ్యక్షులు యెడబోయిన అశోక్,ఉపాధ్యక్షులు కంకణాల రమేష్,సహాయ కార్యదర్శి కొలుపుల రాంచందర్, ఉపకోశాధికారి పత్తిరి రాజు(బ్యాంక్), సంస్థాగత కార్యదర్శులుగా సంగి ప్రవీణ్ కుమార్,సంగి భాను,తొండల నర్సింలు (చిన్న)డైరెక్టర్లుగా సంగి గంగాధర్, మద్దెల శంకర్, గొణుగోపుల మోహన్, బైరం సాయిమౌర్య, కొలుపుల భాను, బైరం శ్రావణ్, పత్తిరీ శేఖర్, సలహాదారులుగా, కొలుపుల బాలయ్య, సంగి రాజలింగం, తొం డల రాజు, బైరం శంకర్, పత్తిరి శివరాజ్, పత్తిరి శంకర్, షేడ శివరాజ్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతనఅధ్యక్షుడుమాట్లాడుతూ ఆలయ అభివృద్ధి,ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ, ఆలయ పరిసరాల శుభ్రత, భక్షులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం,ఆలయానికి సంబందించిన కార్యక్రమాలను పారదర్శకంగా నిర్వహించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు,దాతలు,కుల సంఘాలు, ప్రజల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో కౌన్సిలర్లు పిట్ల వేణుగోపాల్, దాకి అరవింద్ రాజ్, బబ్లూ, ఆలయ కమిటీ సభ్యులు,ప్రముఖులు,భక్తులు పాల్గొన్నారు.

# వాజ్‌పేయి సేవలు స్ఫూర్తిదాయకం.

## బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొనాల గంగారెడ్డి.



బాన్సువాడ బతుకమ్మ : బాన్సువాడ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి 8వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి బీజేపీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షులు కోణాల గంగారెడ్డి మాట్లాడుతూ.. దేశ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు, రాజనీతిజ్ఞుడు అటల్ బిహారీ వాజ్‌పేయి అని అన్నారు. ఆయన అపారమైన దూరదృష్టి, ఆలోచనలు, ప్రసంగాలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సుపరిపాలన, ప్రజా సంక్షేమంపై వాజ్‌పేయి చూపిన ప్రత్యేక శ్రద్ధ ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు.దేశంలో జాతీయ రహదారుల విస్తరణకు వాజ్‌పేయి ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని గంగారెడ్డి గుర్తు చేశారు. దేశ అభివృద్ధికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు చిదుర సాయిలు, బీజేపీ కౌన్సిలర్ గజల మహేష్, బీజేపీ నాయకులు పాశం భాస్కర్ రెడ్డి, చీకట్ల రాజు, సాయిరెడ్డి, ప్రదీప్ సింగ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# నాగుల పంచమి సందర్భంగా ఆవు పాల వితరణ.

బాన్సువాడ బతుకమ్మ : నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని బాన్సువాడ పట్టణంలో సోమవారం ఆవు పాల వితరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ తెలిపారు.తన ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమం పాత బాన్సువాడ సంగమేశ్వర్ కాలనీ చౌరస్తా, న్యూ బాన్సువాడ పెద్ద హనుమాన్ మందిరం వద్ద ఉదయం 7:30 గంటలకు జరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమనికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని షేక్ జుబేర్ పిలుపునిచ్చారు.